3న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 3న నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎల్ఎన్వీ శ్రీధర్ రాజా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. 10.30గంటలకు 6వ స్థాయీ సంఘం, 11.30 గంటలకు 3వ స్థాయీ సంఘం, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయీ సంఘం, మధ్యాహ్నం 2.30 నుంచి 2, 4, 1, 7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు.

ఏళ్ల తరబడి ఆ భూములు సాగు చేస్తున్నాం. ఆ భూములకు సంబంధించి మా పేరిట పాస్‌పుస్తకాలు ఉన్నాయి. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం భూముల సర్వే నెంబర్లు కనిపించడం లేదు. దీంతో భూముల క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. తాజాగా రెవెన్యూ సదస్సుల్లో కూడా మోక్షం దక్కలేదు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

-ఇదీ వజ్రపుకొత్తూరు మండలంలో రైతుల ఆవేదన



ఈ భూములకు.. సర్వే నెంబర్లు ఏవీ?



వజ్రపుకొత్తూరులో సర్వేనెంబర్లు లేని భూమి ఇదే..

- పాస్‌బుక్ ఉన్నా.. ఆన్‌లైన్‌లో నమోదుకాని వైనం
- రీ సర్వేలో తప్పులతడకలు.. రైతులకు ఇబ్బందులు
- రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు వినతులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):

వజ్రపుకొత్తూరు మండలంలో అత్యధిక భాగం తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉంది. దీంతో ఇక్కడ రైతులు సీఆర్‌జెడ్‌తో పాటు జిరాయితీ, అసైన్డ్, డీ-పట్టా భూములు కలిగి ఉన్నారు. కాగా.. జిరాయితీ భూములు కలిగిన రైతుల్లో చాలామందికి పాస్‌పుస్తకాలు ఉన్నా.. ఆన్‌లైన్‌లో వాటి సర్వే నెంబర్లు కనిపించడం లేదు. బాతుపురం, చినవంక, వజ్రపుకొత్తూరు, అమలపాడు, కొత్తపేట, ఉద్దాన రామకృష్ణాపురం, మెట్టూరు, గరుడభద్ర, అక్కుపల్లి తదితర గ్రామాల్లో వందలాది మంది రైతులకు సంబంధించిన భూమి సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఏళ్ల తరబడి తాము భూములు సాగు చేస్తున్నా.. ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు లేకపోవడంతో భూముల క్రయవిక్ర యాలు సాగడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణాలు, ఇతర పనులకు డబ్బులు అవసరమైనా భూము లు విక్రయించలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూముల సమగ్ర సర్వే చేపట్టింది. కాగా భూముల రీ సర్వే చేసిన గ్రామాల్లో కూడా సమస్య పరిష్కారం కాలేద ని రైతులు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా తమ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే పారదర్శకంగా లేదని ఆరోపిస్తున్నారు.

రెవెన్యూ సదస్సులోనూ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల రోజులుగా అధికారులు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. భూ సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నారు. కొన్ని సమస్యలు వారం రోజుల్లో పరిష్కరిస్తామని చెబుతున్నారు. కాగా.. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు ఈ రైతు సదస్సుల్లో కూడా తమ భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు కనిపించడం లేదని, సమస్య పరిష్కరించాలని అధికారులకు వినతులు అందజేశారు. 'వైసీపీ హయాంలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ సక్రమంగా సాగలేదు. మా భూమికి సంబంధించిన సర్వే నెంబర్లు గల్లంతయ్యాయ'ని స్థానిక ఎంపీటీసీ కె.సురేఖ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు డబ్బులు అవసరమైనా.. తమ భూములు విక్రయించుకోలేకపోతున్నామని పలువురు రైతులు తెలిపారు. డబ్బుల్లేక శుభకార్యాలు వాయిదా వేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కాగా.. ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు లేని భూముల విషయమై.. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెప్పడంతో తమ సమస్యకు ఎప్పటికి మోక్షం లభిస్తుందోనని రైతులు నిట్టూర్పుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక..

భూములు ఉన్నా.. సర్వే నెంబర్లు లేని వాటిపై రైతులు రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేస్తున్నారు. సర్వే నెంబర్లు సరిచేయాలని ఎక్కువగా వినతులు అందాయి. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. రైతులు ఆందోళన చెందవద్దు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సర్వే నెంబర్లు సరిచేస్తాం.

-మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్, వజ్రపుకొత్తూరు

రీ సర్వేలో తప్పులు ఉన్నాయి



వైసీపీ పాలనలో ఎంతో ఆర్భాటంగా చేసిన రీసర్వేలో అనేక తప్పులు ఉన్నాయి. కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప.. రైతులకు మేలు జరిగింది తక్కువే. రీ సర్వేతో కొత్త సమస్యలకు ఆజ్యం పోశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో.. గతంలో రీ సర్వే చేసిన గ్రామాల్లోని రైతులే అధికంగా భూ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం రైతుల్లో ఉంది.

- దువ్వాడ హేమబాబు చౌదరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్

సమస్య పరిష్కరించాలి



తీరప్రాంత గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి. రైతు స్వాధీనంలో భూములు ఉన్నా.. మ్యూటేషన్ నెంబర్లు సరిపోల్చక పోవడంతో చాలా వరకు భూములు రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు అనేక శుభకార్యాలను వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. రెవెన్యూ సదస్సుల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం.

- బర్రి పురుషోత్తం, అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు

ఆదిత్యాలయ తలనీలాల
వేలంపాట ఖరారు

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యుడికి భక్తులు సమర్పించే తలనీలాలకు సంబంధించి శనివారం వేలం పాట నిర్వహించారు. 2025 జనవరి1 నుంచి ఏడాది కాలానికి గానూ అనంతపురం జిల్లా హిందుపురానికి చెందిన ఎస్.నాగరాజు రూ.70,02,000కు హెచ్చు పాటదారుడిగా నిలిచారు. అధికారులు ఆయనకే వేలం ఖరారు చేశారు. కొబ్బరి చెక్కలకు సంబంధించి ఒక్కరే హాజరు కావడంతో వేలంపాట వాయిదా వేశారు. ఈ ఏడాది జూలై 25 నుంచి ఇప్పటివరకూ పోగుచేసిన తలనీలాలకు బహిరంగ వేలం వేయగా.. తక్కువ పాట నమోదుకావడంతో వాయిదా వేశారు.

- ఏడాదిపాటు పూలదండలు, విడిపువ్వులు సరఫరా, స్టేషనరీ, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పెరుగు, ప్రసాదం ప్యాకింగ్ కవర్లు, ఎలక్ట్రికల్.. కంప్యూటర్ మెటీరియల్స్ సరఫరాకు ఈ నెల 30న ఈ-టెండర్ కమ్ బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భద్రాజీ తెలిపారు. వీటితోపాటు లడ్డు, పులిహోర ప్యాకింగ్, సెల్‌ఫోన్స్, కెమెరాలు భద్రపరిచే లైసెన్సు, స్వామి ఫొటోలు, గోవుల దాణా సరఫరాకు కూడా వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు, శ్రీకూర్మం ఈవో గురునాథం, జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఆదిత్యా.. చూసితివా?



అరసవల్లిలో ఆదిత్యుడి ఆలయం

- ఆదాయం ఉందిగానీ అభివృద్ధి లేదు
- ప్రసాదాల తయారీలో తగ్గుతున్న నాణ్యత
- కేశఖండనశాల వద్ద అక్రమ వసూళ్లు
- భక్తులకు తప్పని అవస్థలు



ఇతని పేరు వనుము కృష్ణ. ఎచ్చెర్ల మండలం భగీరథపురం పంచాయతీ ఓ అగ్రహారం గ్రామానికి చెందిన ఈయన ఇటీవల తన కుటుంబంతో సహా అరసవల్లికి వచ్చాడు. తలనీలాలు సమర్పించేందుకు కేశఖండన శాలలో ఇద్దరికి టిక్కెట్లు తీసుకున్నాడు. ఒక్కొక్కరికి రూ.40 చొప్పున రూ.80 తీసుకోవాలి. కానీ అతని వద్ద రూ.100 తీసుకుని రెండు టిక్కెట్లు ఇచ్చారు. అనంతరం క్షురకులు కూడా ఇద్దరికి గుండు చేసేందుకు రూ.100 వసూలు చేశారు. అతను మొత్తంగా రూ.200 చెల్లించాల్సి వచ్చింది. దీంతో ఎంతో ఆవేదనకు గురయ్యాడు. ఎప్పుడు ఈ పరిస్థితులు మారతాయోనని ఆవేదన వెలిబుచ్చాడు.

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. దేవస్థానానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా ఆ స్థాయిలో సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మాస్టర్‌ప్లాన్ అంటూ హడావుడి చేయడమే తప్ప.. అభివృద్ధికి మాత్రం అడుగులు పడడం లేదు. ఇక్కడ కనీస సదుపాయాలు కరువయ్యాయి. స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే కుళాయిల కింద చేయాలి. దుస్తులు సైతం బయటే మార్చుకోవాలి. మరుగుదొడ్లు ఉన్నా లోపల దుర్వాసన భరించలేం. అన్న ప్రసాదం, లడ్డూ, పులిహోరలో నాణ్యత కొరవడింది. ఈ ప్రసాదం కూడా ఉదయం ఒక్క పూటే దొరుకుతుంది. మధ్యాహ్నం వెళ్లేవారికి నిరాశే. కేశఖండన శాలకు వెళ్తే నిలువు దోపిడీ. దీంతో భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే నరకం చూస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పరిస్థితిలో మార్పురావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇరుకు మార్గంలో భక్తుల రాకపోకలు

ఇరుకు మార్గం..

ప్రతీ ఆదివారం వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారు. వారు దర్శనానికి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఆలయం ఎదురుగా ఇరుకు మార్గం ఒక్కటే ఉంది. ఆ ఇరుకు మార్గంలోనే యాచకుల హడావుడి. దానికితోడు భక్తులు (మిగతా 6వ పేజీలో..)

న్యూస్ బాక్స్

ప్రశాంతంగా న్యూ ఇయర్
వేడుకలు చేసుకోవాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లావాసులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31న రాత్రిగస్తీలు, వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేయాలని పోలీసులను ఆదేశించారు. న్యూఇయర్ వేడుకల్లో పోలీసులకు సహకరించాలని, ఆంక్షలు పాటించాలని జిల్లావాసులకు సూచించారు. ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు చేసుకోవాలని కోరారు.

- ఈ నెల 31న రాత్రి బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ప్రజలు ఎవరు రహదారులపై తిరగరాదు. ఒకేచోట గుమిగూడి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు. మహిళలు, యువతులను ఈవ్‌టీజింగ్ చేయరాదు.
- మద్యం సేవించి లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేస్‌లు, త్రిబుల్ రైడింగ్‌పై పోలీసుల స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా పోలీసులకు చిక్కితే వాహనాలు సీజ్ చేసి.. కఠిన చర్యలు తీసుకుంటాం.
- బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్‌లు, పార్టీలు, డీజేలు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా డ్యాన్సులు చేయడం నిషేధం. బాణసంచా సామగ్రి కాల్చరాదు.
- మద్యం దుకాణాలు, బార్‌లను ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకే తెరవాలి. హోటళ్లు, రెస్టారెంట్లలో నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు అనుమతులు లేవు. వేడుకల పేరుతో అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు.



పాలవలసలో ఓ ఇంటి గోడకు వేసిన చిత్రం

ఇంటి 'కళ'.. నెరవేరేలా!

- ఇంటీరియర్ డిజైన్‌పై పెరుగుతున్న ఆసక్తి
- గోడలపై అందమైన చిత్రాలు

6లో

విద్యుత్ 'సౌర'భాలు!

- పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రభుత్వం దృష్టి
- సౌర విద్యుత్‌కు ప్రోత్సాహం
- జిల్లాలో 317 మంది రిజిస్ట్రేషన్
- రాయితీతో పాటు మిగులు విద్యుత్ కొనుగోలు

6లో



విద్యుత్ సబ్‌స్టేషన్

ఒక్కటీ లేదు



డ్రైవింగ్ ట్రాక్ (ఫైల్)

- జిల్లాలో కానరాని డ్రైవింగ్ ట్రాక్‌లు
- స్థలం కేటాయింపులో రెవెన్యూ శాఖ జాప్యం
- నిలిచిన స్పీడ్‌గన్ సేవలు
- మరోవైపు ఎంవీఐల కొరతతో ఇక్కట్లు

ఆమోద యోగ్యంగా లేదని..

- గతంలో టెక్కలి ఎంవీఐ కార్యాలయానికి సంబంధించి డ్రైవింగ్ ట్రాక్ కోసం.. మేఘవరం పంచాయతీ అడ్డుకొండ ప్రాంతంలో ఐదు ఎకరాల స్థలం చూపించారు. టెక్కలికి 8 కిలోమీటర్లు దూరంలో కేటాయించిన ఈ స్థలాన్ని అప్పటి రవాణాశాఖ అధికారులు పరిశీలించారు. డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణానికి ఆమోదయోగ్యంగా లేదని తేల్చిచెప్పారు.

- జిల్లా కేంద్రమైన శ్రీకాకుళానికి డ్రైవింగ్‌ట్రాక్ అత్యవసరమని రవాణాశాఖ అధికారులు ఒత్తిడి చేశారు. ప్రజాప్రతినిధులు సిఫారసుతో చివరికి ఎచ్చెర్ల మండలంలో ఐదు ఎకరాల స్థలాన్ని డ్రైవింగ్ ట్రాక్‌కు రెవెన్యూ అధికారులు కేటాయించారు. అందులో మూడు ఎకరాల స్థలం అనుకూలంగా ఉండగా, రెండు ఎకరాల స్థలం గుట్టలుగా ఉండడంతో రవాణాశాఖ అధికారులు డ్రైవింగ్‌ట్రాక్ ఏర్పాటుకు తలలు పట్టుకుంటున్నారు. దీంతో ఎచ్చెర్లలో డ్రైవింగ్ ట్రాక్ పనులు ముందుకు సాగడంలేదు.

టెక్కలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, ఫోర్‌వీలర్, హెవీ వెహికిల్.. ఇలా ఏ వాహనం నడపాలన్నా డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇందనశకట తనిఖీ అధికారి (ఎంవీఐ) కార్యాలయం వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలి. దరఖాస్తుదారులకు ముందుగా ఎల్ఎల్ఆర్ సౌకర్యం కల్పిస్తారు. నెలరోజుల తర్వాత రవాణాశాఖ అధికారులు నిర్వహించిన డ్రైవింగ్ పరీక్షల్లో నెగ్గితే దరఖాస్తుదారుడు వయసు, ఆరోగ్య స్థితిని బట్టి పర్మినెంట్ కార్డులు జారీ చేస్తారు. కాగా.. దరఖాస్తుదారులకు పరీక్షలు నిర్వహించేందుకు జిల్లాలో ఎంవీఐ కార్యాలయాల పరిధిలో ఒక్క డ్రైవింగ్ ట్రాక్ కూడా లేకపోవడం గమనార్హం. డ్రైవింగ్ ట్రాక్‌ల నిర్మాణం ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు కనీసం ఐదారు ఎకరాల స్థలం అవసరం. ఆ స్థలాన్ని రవాణాశాఖకు కేటాయించే విషయంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల పట్టణాలకు దూరంగా కొంతమేర స్థలాలు కేటాయించడంతో.. అవి ప్రతిపాదనల్లోనే మగ్గిపోతున్నాయి.

జిల్లాలోని శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి. ఈ నాలుగు చోట్ల ఎక్కడా డ్రైవింగ్‌ట్రాక్‌లు లేవు. డ్రైవింగ్ (మిగతా 6వ పేజీలో..)

విద్యుత్ సౌరభాలు!

మనం వినియోగించిన విద్యుత్‌కు నెల నెలా బిల్లు చెల్లించడం సాధారణ విషయం. మన విద్యుత్‌ను మనమే ఉత్పత్తి చేసుకొని... ప్రభుత్వానికి తిరిగి విక్రయిస్తే... ఈ ఆలోచన కొత్తగా ఉంది కదూ. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఈ ఆలోచనను ఆచరణలోకి తీసుకురావచ్చని చెబుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. దీనికోసం 'సూర్యఘర్' పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. మనం ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను.. ప్రభుత్వానికి విక్రయించడమే కాదు... రాయితీలనూ పొందవచ్చు.

- పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రభుత్వం దృష్టి
- సౌర విద్యుత్‌కు ప్రోత్సాహం
- జిల్లాలో 317 మంది రిజిస్ట్రేషన్
- రాయితీతో పాటు మిగులు విద్యుత్ కొనుగోలు



ఇచ్ఛాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ ఇంధన వనరుల పరిరక్షణ, సౌర విద్యుత్ వినియోగం పెంపు ద్వారా సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తప్పించేందుకు కేంద్రం 'పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన'కు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టింది. ఇది సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలనుకున్న వారికి శుభవార్త. ఇంటి ప్రాంగణంతో పాటు పైకప్పుపైన సైతం సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలు ప్రకటించాయి. మూడు కిలో వాట్లకు రూ.78 వేల వరకూ సాయం అందించనుంది. ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే ఇంటి అవసరాలకు పోనూ మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవచ్చు. దీనిని డిస్కంలు కొనుగోలు చేసి.. ఆ నగదును లబ్ధిదారుడికి అందిస్తాయి. మన రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మాత్రం ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు? మిగతా వారు ఎంతమంది? అందులో సోలార్ ప్లాంట్లు పెట్టడానికి అనువైన కనెక్షన్లు ఎన్ని? అన్నదానిపై సర్వే పూర్తి చేసింది. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల పరిధిలో 8,05,2014 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 6,75,196 గృహాలకు సంబంధించినవే. తాజా సర్వే ప్రకారం 3 లక్షల కనెక్షన్లకు సౌర విద్యుత్ అందించేందుకు అనువుగా ఉన్నట్టు గుర్తించారు.

● మిగులు విద్యుత్ కొనుగోలు..

ఎవరైనా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకొని.. వారు వాడిన విద్యుత్ కంటే ఎక్కువ ఉత్పత్తి చేస్తే... మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. డిస్కంలే ఆ మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకసారి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే 25 సంవత్సరాల పాటు వాడుకోవచ్చు.

- ఒక కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకూ ఖర్చవుతుంది. దీనిలో రూ.30 వేల వరకూ ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.
- రెండు కిలో వాట్ల ప్లాంట్ అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. దీనిలో రూ.60 వేల వరకూ రాయితీ అందిస్తారు.
- మూడు కిలోవాట్లకు రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షలు ఖర్చవుతుంది. రూ.90 వేల వరకూ రాయితీ పొందవచ్చు. దీనికి గాను జాతీయ బ్యాంకుల నుంచి రుణం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే.. చాలా వరకూ మిగిలే అవకాశం ఉంటుంది. దానిని డిస్కంలకు విక్రయించి.. కొంత ప్రయోజనం పొందవచ్చు.



ఇచ్ఛాపురంలో రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఈఓ..

వినియోగించుకోవాలి..

ఇచ్ఛాపురం మండలం నుంచి 60, మున్సిపాల్టీ నుంచి 37 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు మున్సిపాల్టీ నుంచి ఐదుగురు రిజిస్ట్రేషన్ చేసి డబ్బులు చెల్లించారు. మిగిలిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-గోవిందరావు, విద్యుత్ శాఖ ఏఈ, ఇచ్ఛాపురం

ఇదో మంచి అవకాశం..

జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి సర్వే జరుగుతోంది. ముఖ్యంగా లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వస్తే మంజూరవుతాయి. దీనికి రాయితీ అందిస్తారు. మిగులు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన వారు 9440812386 నంబరుకు సంప్రదించాలి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 317 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 239 మంది నిర్ణీత రుసుం చెల్లించారు. మిగిలిన వారు డబ్బులు చెల్లించాల్సి ఉంది.

-ఎన్.కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ

బహుళ ప్రయోజనం..

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో లబ్ధిదారుడితో పాటు ప్రభుత్వానికీ ప్రయోజనమే. ప్రభుత్వానికి ప్రస్తుతం ఖర్చు పెరిగినా.. దీర్ఘకాలంలో విద్యుత్ పంపిణీ, కొనుగోలు భారం క్రమేపీ తగ్గుముఖం పడుతుంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 200లోపు యూనిట్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారు. సాధారణంగా ఒక్కో యూనిట్‌కు రూ.6 వంతున ఖర్చు అవుతుంది. సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే చాలా వరకూ ప్రభుత్వానికి ఆదా అయినట్టే. ఎక్కువ మంది ఎస్సీ లబ్ధిదారులు 150 యూనిట్లకు మించి వాడరు. ఒక కిలో వాట్ సోలార్ ప్రాజెక్టు 120 యూనిట్లను అందిస్తుంది. అప్పుడు ప్రభుత్వంపై కేవలం 20 నుంచి 30 యూనిట్ల భారమే పడుతుంది. ఎవరైనా సోలార్ ప్రాజెక్టుపై ఆసక్తి చూపితే వారితో ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

- ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు 100 చదరపు అడుగుల స్థలం అవసరం. రెండు కిలో వాట్లకు 200 చదరపు అడుగులు, మూడు కిలోవాట్లకు 300 చదరపు అడుగుల స్థలం అవసరం.
- జిల్లాలో సోలార్ ప్యానెల్స్ అందించేందుకు 16 మంది వెండర్లు ఉన్నారు. వినియోగదారులు వెండర్లను ఎంపిక చేసుకొని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. విద్యుత్ శాఖ సిబ్బందిని, వెండర్‌ను సంప్రదిస్తే అవసరమైన ప్రక్రియ చేపడతారు. ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 317 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఇంటి కళ.. నెరవేరేలా!



- ఇళ్లకు కొత్త హంగులు
- ఇంటీరియర్ డిజైన్‌పై మరింత ఆసక్తి
- గోడలపై అందమైన చిత్రాలు
- కళాకారులకు పెరుగుతున్న అవకాశాలు

మెళియాపుట్టి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కుటుంబమంతటికీ అనుకూలంగా ఉండేలా ఓ ఇల్లు కట్టుకుంటే చాలు.. ఇదీ నిన్నటి తరం ఆలోచన. ఇల్లు అందంగా ఉండాలి... ఆకర్షణీయంగా ఉండాలి.. ఇంట్లో అడుగు పెడితే ఆహ్లాదంగా ఉండాలి. ఇంకా చెప్పాలంటే ఇంటికి వచ్చే వారిని ఆకట్టుకోవాలి. దీని కోసం ఎంత డబ్బయినా ఖర్చు చేయాలి.. అవసరమైతే అప్పు చేసినా ఫరవాలేదు.. ఇదీ నేటి తరం ఆలోచన. ఇల్లు కట్టుకోవడమనేది ఎవరికైనా జీవిత కాలపు కల. దానిని నెరవేర్చుకోవడానికి ఎంతో కష్టపడుతుంటారు. అయితే ప్రస్తుత తరం ఏదో ఒక తరహాలో నిర్మించుకొని.. సంతృప్తి చెందడం లేదు. ఇళ్లకు తమ అభిరుచికి అనుగుణంగా హంగులు అద్దుతున్నారు. ఇంటీరియర్ డెకరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ ట్రెండ్.. ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది. ఫలితంగా ఇంటీరియర్ డిజైనర్లకు... చిత్రకారులకు డిమాండ్ పెరిగింది.

భారీ ఖర్చుతో..


మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన ఒక వ్యాపారి నూతనంగా నిర్మించిన ఇంట్లో ఇంటీరియర్ డెకరేషన్‌కు రూ.కోటికి పైగా ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. దీనిని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటీరియర్ డిజైన్ పట్ల ఎంత ఆసక్తి పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఇళ్లు ఎలా ఉన్నా పెద్దగా పట్టించుకోనేవారు కాదు.. కానీ ఇప్పుడు అప్పు చేసైనా ఒక మంచి ఇంటితో పాటు లోపల.. బయట వివిధ రూపాల్లో ప్రత్యేక నగిషీలు చెక్కేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో ఇంటీరియర్ డెకరేషన్ చేసే వాళ్లకే కాదు... చిత్రకారులకూ పని దొరుకుతోంది. జీవకళ ఉటిపడేలా పక్షులు.. జంతువులు... మొక్కల బొమ్మలు... పురాణ... ఇతిహాస ఘట్టాలు ఇళ్ల గోడలపై తళుకులీను తున్నాయి. కొన్ని ఇళ్లలో గాజు, చెక్కతోనూ వివిధ రూపాలను తీర్చిదిద్దుతున్నారు. గోడలకు త్రీడీ చిత్రాలు అలంకరించడం ఇటీవల కాలంలో పెరిగింది.

చిత్రకారులకు గిరాకీ..

ఒకప్పుడు చిత్రకారులు ఆదరణ లేక జీవనం కొనసాగించడానికి ఇబ్బందులు పడేవారు. దీంతో చిత్రకళపై ఆసక్తి చూపేవారు తగ్గుతూ వచ్చారు. ఇటీవల కాలంలో ప్రజల అభిరుచులు మారడం.. చిత్రకారులకు కలిసి వస్తోంది. ఫలితంగా వారికి డిమాండ్ పెరుగుతోంది. గోడల పొడవు, వెడల్పులను బట్టి వీటి ధరలు ఉంటున్నాయి. ఓ మాదిరి ఇంటికి త్రీడీ చిత్రాలకైతే రూ.30 వేలకు పైనే వెచ్చించాల్సి ఉంటుందని కళాకారులు చెబుతున్నారు. ఇవి గిట్టుబాటు అవుతుండడంతో గిరిజన ప్రాంతాల వారు సైతం ప్రత్యేకంగా ఈ చిత్రాలు గీసేందుకు శిక్షణ పొందుతున్నారు.



పాలవలసలోని ఓ ఇంటి గోడ ఇలా...



జలగలింగుపురంలోని ఓ ఇంట్లో..

జీవకళ ఉట్టిపడేలా..

ఓవైపు ఇంటీరియర్ డిజైన్‌తో పాటు ఇళ్లలోని గోడలపై వేసే చిత్రాలు చూపు తిప్పుకోనివ్వకుండా చేసేలా కళాకారులు తమ ప్రతిభను చూపుతున్నారు. జీవకళ ఉట్టిపడేలా గోడలపై బొమ్మలు గీస్తున్నారు. కొంతమంది అయితే రాజస్థాన్ ఆర్ట్, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ నుంచి ఇంటి నిర్మాణాలకు అవసరమైన అన్ని రకాల పరికరాలు తీసుకువచ్చి తమదైన శైలిలో అలంకరిస్తున్నారు. పాతకాలం నాటి టెలిఫోన్, లాంతర్లు, చెట్టుకొమ్మలు ఇప్పుడు అందంగా గోడలపై కొలువుదీరుతున్నాయి.

ఆదరణ పెరిగింది..

అందమైన చిత్రాలు గీయగలిగినా ఒకప్పుడు మాకు ఆదరణ ఉండేది కాదు. ఎవరు అవకాశమిస్తారా? అని ఎదురుచూసే వాడిని. కానీ ప్రస్తుతం గోడలపై చిత్రాలు గీయడానికి అవకాశాలు వస్తునాయి. చేతినిండా పని దొరుకుతోంది. గోడలపై త్రీడీ చిత్రాలకు మంచి ఆదరణ ఉంటోంది.

-బెజ్జి జగదీష్, పెయింటర్, జంతూరు

ఆదిత్యా.. చూసితివా?

(ఐదో పేజీ తరువాయి)



ఆలయ ప్రాంగణంలో ఆగని కుక్కల బెడద

ద్విచక్ర వాహనాలపై అదే దారిలో ముందుకు వెళ్లి అక్కడే పార్కు చేస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులు తప్పడం లేదు. తలనీలాల ప్రదేశం వద్ద, భక్తులు స్నానాలు ఆచరించే చోట కుక్కల బెడద అధికంగా ఉంది. గతం లో పలువురు భక్తులను కుక్కలు గాయపరిచాయి. మరుగుదొడ్ల పరిస్థితి అయితే చెప్పనక్కరలే దు. అధ్వానంగా ఉండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో భక్తులు ముక్కు మూసుకుని వినియోగించాల్సి వస్తోంది.

తగ్గుతున్న అన్నప్రసాదం నాణ్యత..

కొంత కాలంగా స్వామి అన్నప్రసాదం నాణ్యత తగ్గుతోందని, భోజనాలు బాగోవడం లేదని భక్తులు వాపోతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో రుచికరంగా అన్నప్రసాదం తయారు చేసేవారు. బియ్యం, పప్పులు నాణ్యతమైనవి వినియోగించేవారు. ప్రస్తుతం నాశిరకం బియ్యం, పప్పులే వినియోగిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. నిజానికి ఒక భక్తుడి భోజనం కోసం రూ.50చొప్పున కేటాయిస్తున్నారు. ఈ డబ్బులతో నాణ్యమైన భోజనం అందించవచ్చు. కానీ, సిబ్బంది చేతివాటంతో నాణ్యత లోపిస్తుందని భక్తులు ఆరోపిస్తున్నారు. గతంలో భోజనంలో పప్పు, రసం ఉండేవి. ఇప్పుడు ఒక్క సాంబారు మాత్రమే వడ్డిస్తున్నారని పేర్కొంటున్నారు.

లడ్డూలో నెయ్యి, జీడిపప్పు మాయం..

లడ్డూ తయారీలో నాణ్యత పూర్తిగా దిగజారిపోయిందని భక్తులు వాపోతున్నారు. గతంలో నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్ వేసి చేసిన లడ్డూలు ఎంతో రుచిగా ఉండేవి. ప్రస్తుతం లడ్డూలో నెయ్యి, జీడిపప్పు ఆనవాళ్లు పెద్దగా కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పులిహోర ప్రసాదం కూడా రుచి తగ్గింది. నిజానికి పులిహోర ఒక్కో ప్యాకెట్ 150 గ్రాముల పరిమాణంతో ఉండాలి. కానీ, తక్కువ పరిమాణంలో తయారుచేస్తున్నారు. ఈ ప్రసాదాలు కూడా సరిపడినంత తయారుచేయడం లేదు. మధ్యాహ్నం పూట వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందుబాటులో ఉండడం లేదని పలువురు వాపోతున్నారు.

కేశఖండనశాలలో నిలువు దోపిడీ..

కేశఖండన శాలలో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఇద్దరు భక్తులు గుండు గీయించుకోవాలంటే రూ.200 ఖర్చు చేయాల్సి వస్తోంది. టిక్కెట్ల కోసం రూ.100, క్షురకులకు రూ.100 చెల్లిస్తేనే తలనీలాలు తీస్తారు. భక్తుల ఫిర్యాదుతో అధికారులు పలుమార్లు క్షురకులు, సిబ్బందిని హెచ్చరించినా.. వారి పనితీరులో మార్పులేదు. ఆదివారం ఈ అక్రమ వసూళ్ల దందా యథావిధిగా కొనసాగుతోంది. ఆలయ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

● చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఆరా

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసు యంత్రాంగం గట్టి నిఘా పెడుతోంది. డ్రోన్లతో జల్లెడ పడుతోంది. నిర్మానుష్య ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగడం, పేకాట, చైన్ స్నాచింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై దృష్టి పెడుతోంది. ఈ మేరకు శనివారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పీఎన్ కాలనీ, భైరవానిపేట, శాంతినగర్ కాలనీ, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాల పరిసరాలను డ్రోన్ కెమెరాలతో చిత్రించారు. ఈ చిత్రాల ఆధారంగా అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నగరంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నామని తెలిపారు. అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



డ్రోన్ కెమెరాలతో తీసిన నదీ పరీవాహక ప్రాంతాల చిత్రాలు

వీవోఏ తొలగింపుపై రభస

● వెలుగు కార్యాలయం వద్ద ధర్నా

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల వీవోఏను తొలగించడంపై బాధితులు, సభ్యులు శనివారం శ్రీకాకుళంలోని వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తనను రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఏపీఎం రజని విధుల నుంచి తొలగించారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. వీఓఏ రాధా కుమారి విలేకరులకు తెలిపిన వివరాలివీ.. చల్లవానిపేట గ్రామానికి చెందిన బొబ్బాది రాధా కుమారి ఏడాది కాలంగా స్వగ్రామంతో పాటు నైరలో వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ ఫెసిలిటేటర్)గా పని చేస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో కొత్తగా విధుల్లోకి చేరిన కె.రజనిని కలిసేందుకు కార్యాలయానికి వెళ్లగా... తన దగ్గర ఉన్న రికార్డులను ఏపీఎం తీసుకుని తిరిగి ఇవ్వలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. నవంబరు నెలలో కొర్ను సంధ్య అనే మహిళను రాధ స్థానంలో వీఓఏగా నియమించి రికార్డులు అప్పగించారు. ఆమె రూరల్ మండలంలోని వెంకటాపురం, నైర గ్రామంలో విధులకు హాజరైందని చెప్పారు. దీనిపై ప్రశ్నిస్తే.. గ్రామంలోని సంఘ సభ్యుల తీర్మానం ప్రకారమే కొత్త వారిని నియమించారని రజని చెప్పారన్నారు. దీంతో ఈ నెల 19న సమావేశం నిర్వహించగా 22 సంఘాల సభ్యులు ముక్తకంఠంతో తనను విధుల నుంచి తొలగించకూడదని చెప్పారని అన్నారు. సభ్యుల తీర్మానాన్ని పక్కన పెట్టి.. రాజకీయ ఒత్తిళ్లతో తనను తొలగించారని రాధా కుమారి ఆరోపించారు.



ఏపీఎం రజనీని నిలదీస్తున్న వీవోఏ రాధాకుమారి తదితరులు

కొత్తగా నియమించినట్టు తెలియదు..

వీవోఏ తొలగింపు విషయమై ఏపీఎం కె.రజనిని వివరణ కోరగా.. రికార్డులు తీసుకున్న మాట వాస్తవమేనని చెప్పారు. కొత్త వీవోఏ సంధ్యను నియమించినట్టు తనకు తెలియదని అన్నారు. తన చుట్టూ రాజకీయ పన్నాగం పన్నుతున్నారని ఏపీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటూ బాధితురాలితో పాటు సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఒక్కటీ లేదు

(ఐదో పేజీ తరువాయి)

ట్రాక్ ఉన్నచోట లైట్‌ట్రాక్, హెవీ ట్రాక్, టూవీలర్ ట్రాక్, హెవీట్రైలర్ నడిపే ట్రాక్‌ల సౌకర్యం ఉండాలి. అప్రోచ్‌రోడ్డు, టూవీలర్ పార్కింగ్, రెస్ట్ రూమ్, మౌలిక సదుపాయాలు, కనీసం మూడువేల చదరపు అడుగుల ఎంవీఐ కార్యాలయాల నిర్మాణాలు ఉండాలి. ఈ మేరకు ట్రాక్ స్థలం ఏర్పాటుకు రవాణాశాఖ అధికారులు దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం స్థలం కేటాయింపు విషయంలో కాలయాపన చేస్తున్నారు.

నిలిచిన స్పీడ్‌గన్ సేవలు..

రవాణా శాఖలో వాహనాల వేగాన్ని గుర్తించేందుకు అవసరమైన స్పీడ్‌గన్‌లు ఆయా ఇంధనశకట తనిఖీ అధికారుల కార్యాలయాలకు అవసరముంది. జిల్లాకు ఒకే ఒక్క స్పీడ్‌గన్‌కు పరిమితమైంది. ఈ ఒక్క స్పీడ్‌గన్ ద్వారా ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు సేవలు అందించడం కష్టతరంగా మారుతోంది. ఆయా ఎంవీఐ కార్యాలయాల పరిధిలో ఒక్కోసారి ఒక్కో ప్రాంతానికి స్పీడ్‌గన్‌లు పంపిస్తున్నారు. సాంకేతిక మరమ్మతుల నేపథ్యంలో ప్రస్తుతం ఈ స్పీడ్‌గన్ సేవలు నిలిచిపోయాయి.

ఎంవీఐల కొరత..

ఉమ్మడి జిల్లాలో 22 మంది వరకు ఎంవీఐలు అవసరం కాగా.. ప్రస్తుతం ఏడుగురే ఉన్నారు. వారితోనే రవాణా శాఖ కాలం నెట్టుకొస్తుంది. అపరాధ రుసుం లక్ష్యాలు వసూలు చేయడంలో ఎంవీఐలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో తరచూ ఎంవీఐలు ఆయా రకాల వాహన తనిఖీలు చేసేవారు. నేడు ఎంవీఐల కొరతతో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ప్రతిపాదించాం..

జిల్లాలో ఎంవీఐ కార్యాలయాలకు అవసరమయ్యే డ్రైవింగ్ ట్రాక్‌ల కోసం ప్రతిపాదనలు చేశాం. ప్రస్తుతం ఎచ్చెర్ల వద్ద ట్రాక్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. ఇక్కడ రెండు ఎకరాల స్థలం గుట్టలుగా ఉండడంతో చదును చేయాల్సి ఉంది. జిల్లాలో ఒకే ఒక్క స్పీడ్‌గన్ సౌకర్యం ఉన్నా.. సాంకేతిక సమస్య కారణంగా ఆ సేవలు నిలిచాయి. వారం, పది రోజుల్లో స్పీడ్‌గన్ సేవలు పునరుద్ధరిస్తాం. ఖాళీగా ఉన్న ఎంవీఐ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-విజయసారథి, డీటీసీ

సచివాలయానికి దారి కల్పించండి

లావేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్రాలపాలెం గ్రామ సచివాలయానికి దారేదని ఆ సచివాలయం పరిధిలోని పెదకొత్తపల్లి సర్పంచ్ ఆరెళ్ల కృష్ణ అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్టు అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆరెళ్ల కృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో గుర్రాలపాలెంలో గ్రామ సచివాలయం భవనం నిర్మించారని, ఇప్పుడు ఆ కార్యాలయానికి వెళ్లాలంటే ఆ స్థలాన్ని ఇచ్చిన రైతు అడ్డగిస్తున్నారని, ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. వివిధ సమస్యలపై పలువురు సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. సౌర విద్యుత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ అప్పన్న తెలిపారు. అలాగూ మండల పరిషత్‌కు సంబంధించి 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌లకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో పి.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఆమోదం

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): 2025-2026 ఏడాదికి సంబంధించిన వార్షిక సవరణ బడ్జెట్‌పై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 2024-2025 సవరణ బడ్జెట్‌లో రూ.22,64,803 ప్రారంభ నిల్వతో ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ బడ్జెట్ చూపించారు. అలాగే 2025-2026కు గాను అంచనా బడ్జెట్ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో జడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీపీ నిర్మల, కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

బూర్జ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు పెద్దపేట ఆర్ట్ స్వచ్ఛంద సంస్థలో శనివారం నివాళులర్పించారు. సంస్థ అధినేత నూక సన్యాసిరావు, సీనియర్ సైంటిస్ట్ శ్రీహరి ఆధ్వర్యంలో సంతాపం తెలిపి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి అయంతి, బూర్జ ఆర్ట్ స్టాఫ్ అనూప్, బి.శంకరరావు, రవి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇచ్ఛాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను శనివారం ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. టీడీపీ సీనియర్ నేత ఎస్ఎన్ పండా సతీమణి, పంచాయతన అయ్యప్పస్వామి దేవాలయ ధర్మకర్త దుర్గా గురుస్వామి అనారోగ్యాలతో మృతి చెందారు. వీరి కుటుంబాలకు పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పిలక సంతు, ప్రకాష్‌రావుపట్నాయిక్, బచ్చు జగన్, తదితరులు పాల్గొన్నారు.

● బూర్జ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నీలాదేవిపురంలో ఇటీవల కన్నుమూసిన పలువురు వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలను ఆమదాలవలస నియోజకవర్గ ఆ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. అధికార పార్టీ బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

జి.సిగడాం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా సంతవురిటిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించుకున్నారు. నెలరోజులపాటు నిత్య పూజలు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు.

నేడు కోటి దీపోత్సవం



దీపోత్సవానికి చేసిన ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం ఈ నెల 29వ తేదీ ఆదివారం ఏడురోడ్ల కూడలి సమీపంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్నట్టు విజయదుర్గా అమ్మవారు ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, పెంట శ్రీధర్ శర్మ తెలిపారు. ఈ ఉత్సవాలకు శృంగేరి మఠం, శంకర తత్వప్రసార అభియాన్, ఆదిశంకరాచార్య భక్త సమాజ వ్యవస్థాపకులు, తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ హాజరై ప్రవచనం చేయనున్నట్టు తెలిపారు. 86 బాక్సులలో 350 లింగాలు ఏర్పాటు చేసి ఒక్కో ప్రమిదలో 366 ఒత్తులను ఉంచి కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీపోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు 94405 46872, 91555 55599 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరీక్షలపై భయాన్ని వీడండి

సరుబుజ్జిలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు తొలుత భయాన్ని వీడాలని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రాజశేఖర్ అన్నారు. శనివారం పాఠశాలలో ఉన్న పదో తరగతి బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షల విధివిధానాలపై అవగాహన నిర్వహించారు. పరీక్షపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చ-2025లో విద్యార్థులు విరివిగా పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని వమరవల్లి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం విద్యార్థులు టి.దీపిక, కె.భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు రిజిస్టర్ విధానంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు మందపల్లి రామకృష్ణారావు, సత్యనారాయణ తది తరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

గార, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పర్యవేక్షణ కోసం గ్రామాల్లోకి సామాజిక బృందాలు తనిఖీలు చేస్తున్నట్టు ఎస్ఆర్‌పీ నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఎంపీడీవో ఎస్.రామ్మోహనావు, ఏపీవో ఎస్.సంధ్యారాణి, జేఈ వి.నారన్నాయుడు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయించండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిప్పనపుట్టుగ జంక్షన్ నుంచి కేశుపురం వరకు ఇటీవల నిర్మించిన రోడ్డు అప్పుడే ముక్కలుగా వీడిపోతుందని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేయించాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. శనివారం రోడ్డును పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ సిబ్బందితో మాట్లాడారు. వర్షాలు కారణంగానే పనులు పూర్తి కాలేదని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని వారు సమాధానం ఇచ్చారు. అనంతరం తులసిగాం నుంచి బూర్జుపాడు వరకు నిర్మాణ దశలో ఉన్న రోడ్డు పనులు పరిశీలించారు. కార్యక్ర మంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, జనసైనికులు భారతిరెడ్డి, హేమసుందర్, ప్రేమ్‌కుమార్, కుమార్, హేమంత్ తదతరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చార్జీలు ఒక్క పైసా పెంచలేదు

● ప్రజలను తప్పుతోవపట్టిస్తున్న వైసీపీ నేతలు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీలను ఒక్క పైసా కూడా కూటమి ప్రభుత్వం పెంచలేదని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ధ్వజమెత్తారు. నగరంలోని స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలకు ఇప్పటికీ రాష్ట్ర ప్రజలు బాధలు అనుభవిస్తున్నారన్నారు. వైసీపీ తప్పుడు విధానాల వలన విద్యుత్తు రంగంపై రూ.1.29 లక్షల కోట్లు ప్రజలపై భారం పడిందన్నారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను మోసం చేసే పని ఇంకెంత కాలం చేస్తారని వైసీపీ నాయకులను ఆయన ప్రశ్నించారు. విద్యుత్తు రెగ్యులేటరీ కమిటీ చెప్పిన దాని కంటే ఎక్కువ ధరకు విద్యుత్తును కొనుగోలు చేసారని, దాని ఫలితమే ఇప్పుడు అడ్జస్ట్‌మెంట్ చార్జీలు వేయడం జరుగుతోందని, ఇది జగన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన బహుమతేనని అన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్తు వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీర రమణయ్య, పాండ్రంకి శంకర్, చిట్టి మోహన్, ఎండు చిన్నారావు, పంచిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చార్జీలు పెంచేసి.. ధర్నాలు చేయడం సిగ్గుచేటు

● ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

కవిటి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచిన వైసీపీ నాయకులు ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలపై రూ.49వేల కోట్లు అప్పుచేసినా కొత్త విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేయలేదన్నారు. నిర్మాణంలో ఉన్న కృష్ణపట్నం, వీటీపీఎస్‌లను సకాలంలో ప్రారంభించలేదన్నారు. దీంతో విద్యుత్ కొరతను సృష్టించి కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్లే రూ.2700 కోట్లు నష్టం వచ్చిందన్నారు. అంతేకాక విద్యుత్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ వంటి విద్యుత్ పరికరాలును కమీషన్ల కోసం అధికరేట్లకు కొనుగోలు చేయడంతో రాష్ట్రానికి కోట్లలో నష్టం వాటిల్లిందన్నారు. ఇలా విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసి ట్రూఅప్ చార్జీలపేరిట వినియోగదారులపై భారం వేసిన జగన్‌రెడ్డి ఇప్పుడు ధర్నాలు చేయించడం దుర్మార్గమని మండిపడ్డారు.

వైసీపీ ధర్నాలు హాస్యాస్పదం

కవిటి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తూ ఆ పార్టీ నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి లోళ్ల రాజేష్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు అసత్యప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టించేందుకు చూస్తున్నారని, దీన్ని కూటమి నేతలు తిప్పికొటాలన్నారు. జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం తగదన్నారు.

పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు: ఎస్పీ



సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సాయుధ మైదానాన్ని శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ప్రాథమిక రాత పరీక్షలో 7,390 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో 1,175 మంది మహిళలు, 6,215 మంది పురుషులని చెప్పారు. వచ్చే నెల 18వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఫిజికల్ మెజర్‌మెంట్స్, ఎఫిషియన్సీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ ఎంపికలు చేపడుతున్నామన్నారు. వైద్య శిబిరాన్ని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో సూచించిన విధంగా ఒరిజనల్ ధ్రువ పత్రాలతోపాటు ఒక సెట్ అటెస్టెడ్ జెరాక్స్ కాపీలు, ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణులైన కాపీని తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దన్నారు. దళారీలను నమ్మి మోసపోవద్దన్నారు. అట్టి వ్యక్తులు తారసపడతే 63099 90800, 63099 90911 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు అప్పారావు, మూర్తి, ప్రసాదరావు, శేషాద్రి, రాంబాబు, శివరామిరెడ్డి, ఏవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

● ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు



పోరుదీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎన్.నాగభూషణం, ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీనివల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని కళాశాల యాజమాన్యాలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, వసతి దీవెన రూ.1,480 కోట్లు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, 77 నెంబరు జీవోను రద్దు చేయాలని కోరారు. లేకుంటే ఈ నెల 30న విజయవాడలో పోరుదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.రాము, సహాయ కార్యదర్శి హరి, రాజు, ప్రవీణ్, రమేష్‌కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంపకం అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రజనీకుమారి ఆధ్వర్యంలో విద్యార్థి నులు మొక్కలు నాటారు. ఏజీఎంవో పి.సుధాకర్, అధ్యాపకులు యుగంధర్, బాపూజీ, ప్రసాదరావు, జగదీష్, సునీత పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల్లో 'కుప్పిలి' కవితాగానం



కవిత చదువుతున్న రాజారావు

ఆమదాలవలస, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభలో కుప్పిలి వెంకట రాజారావు కవితాగానం పలువురిని ఆకట్టుకుంటుంది. శనివారం విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సాహితీవేత్త గుత్తికొండ పూర్ణచందు, మాజీ ఉప సభాపతి మండలి బుద్ద ప్రసాద్ ఆధ్వ ర్యంలో జరుగుతున్న ఈ మహాసభల్లో జరిగిన కవి సమ్మేళనంలో పట్టణానికి చెందిన రచయిత, కవి కుప్పిలి వెంకట రాజారావు కవితను చదివి ఆహుతులను ఆకట్టుకున్నారు.

367వ రోజుకు చేరిన బెంతొరియాల నిరసన



సంఘీభావం తెలుపుతున్న కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్

కవిటి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంతొరియా కులస్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరుతూ కవిటిలో చేపట్టిన నిరసన దీక్ష శనివారం నాటికి 367వ రోజుకు చేరింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెంతొరియా కులస్థులకు కులగుర్తింపు లేదు. గతంలో కొన్నేళ్లు గుర్తింపు కల్పించినా ఆ తర్వాత రద్దు చేశారు. జగన్ ప్రభుత్వంలో రెండు కమిటీలతో అధ్యాయనాలు చేసినా.. ఆ నివేదికలు ఏమైనాయో తెలియని పరిస్థితి. నివాస ధ్రువీకరణను నిలిపివేసి ఈ కులస్థులకు తీరని అన్యాయం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెంతొరియాలకు నివాస ధ్రువ పత్రాలు ఇవ్వడానికి అనుమతి లభించింది. అయితే వీరు తమకు ఎస్టీ కులధ్రువ పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తునే ఉన్నారు. ఈమేరకు కవిటిలో గత ఏడాది కాలంగా బస్టాండ్ ఆవరణలో నిరసన దీక్ష చేపడుతున్నారు. శనివారం కులపెద్దలంతా కలసి నల్లబ్యాడ్జీలు ధరించి ఈ దీక్షలో కూర్చొన్నారు. వీరికి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ సంఘీభావం తెలిపారు. బెంతుల విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో బెంతొరియా నేతలు రజనీకుమార్ దొళాయి, దేవరాజు సాహు, మెహన్ సాహు, సుమన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో యూత్ సర్వీసెస్ కమిషనర్



కమిషనర్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని యూత్ సర్వీసెస్ కమిషనర్ కె.శారదాదేవి (ఐఏఎస్) శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఏపీపీ శ్రీనివాసరావు

గుజరాతీపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన కింజరాపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానాను శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రాసిక్యూషన్ గౌరవాన్ని కాపాడుతూ కోర్టుల్లో సెషన్స్ కేసులు త్వరితంగా పరిష్కరించేలా కృషిచేయాలని జిల్లా ప్రధాన నాయాధికారి సూచించారు. కార్యక్రమంలో పీపీ వాన కృష్ణచంద్, జిల్లా బార్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు ఆగూరు ఉమామహేశ్వరరావు, వై.ప్రసన్నకుమార్, పి.మల్లిబాబు, టి.శివ ప్రసాదరావు, టి.రాజారావు, కె.రమణమూర్తి పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గానామృతం



శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో శనివారం ఘంటసాల గానామృతం జీబీఏ సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తరాంధ్ర గాయకులు, విజయనగరానికి చెందిన బీఏ నారాయణ, శ్రీకాకుళం గాయకులు నిక్కు అప్పన్న, వీర్రాజు, రుద్రరాజు రామ్మోహన్, కేవీఎల్ఎన్ మూర్తి కామేశ్వరరావు తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. ఎమ్మెల్యే గొండు శంకర్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, వైద్యులు సుధీర్, అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. పువ్వులు, పండ్ల వ్యాపారులతో శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. చేపల మార్కెట్‌లో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

క్రికెటర్ నితీష్‌కు మంత్రి అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాపై సెంచరీ సాధించి ఉత్తరాంధ్ర సత్తాచాటిన విశాఖ యువకుడు నితీష్ కుమార్‌రెడ్డి తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని నెలబెట్టాడని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. నితీష్ నేటి యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన నితీష్ మనోధైర్యానికి నిదర్శనమని కొనియాడారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఎచ్చెర్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఎచ్చెర్లలో శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. డ్వామా పీడీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో రూ.32.19 కోట్లతో 2,618 పనులు జరిగాయన్నారు. దీనిపై గ్రామ స్థాయిలో సభలు నిర్వహించి, పనుల కొలతలను గుర్తించగా అక్కడకక్కడ లోటుపాట్లను గుర్తించామన్నారు. వీటన్నింటిపై విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీడీలు పంచాది రాధ, కె.లోకేష్, హెచ్ఆర్‌డీ శ్రావణ్‌కుమార్, ఏపీవో శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

అరసవల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా జరుగుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాగోలుకు చెందిన పలువురు తన క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల బాధలకు అంతులేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. నాయకులను, కార్యకర్తలను ఎంతో గౌరవించే పార్టీ టీడీపీ అని, అందుకే స్వచ్ఛందంగా ప్రజలు పార్టీలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో చల్లా రాజా వెంకటరమణ బాబు, చల్లా గోవిందరావు, చల్లా రూపచంద్రశేఖర్, కూటికుప్పల సురేష్‌బాబు తదితరులు పార్టీలో చేరారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

గార, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 2025-26 సంవత్సరం బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో పంచాయతీల అభివృద్ధి చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అంచనా బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించింది. జడ్పీటీసీ సభ్యులు మార్పు సుజాత, గార సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్, ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణ, ఏవో రఘు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు ముందుకు రావాలి

సోంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతివ్యక్తి తమ వంత బాధ్యతగా ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. కొర్లాం జాగృతి స్వచ్ఛంద సంస్థ శనివారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, డి.లక్ష్మణరావు, తామాడ వాసుదేవరావు, రాంబుడ్డి జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్టు

సోంపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న కొరంజిభద్ర గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బాబీ తెలిపారు. అదేవిధంగా రామరాయి గ్రామం వద్ద 600 లీటర్ల పులిసిన బెల్లం ధ్వంస చేసినట్టు తెలిపారు.

లావేరు బీజేపీ అధ్యక్షుడిగా వీరబాబు



లావేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లావేరు మండల బీజేపీ అధ్యక్షుడిగా కొత్త కుంకాం పంచాయతీ ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన దేవి రెడ్డి వీరబాబు నియమితులైయ్యారు. పార్టీలో తన కృషిని గుర్తించి ఈ పదవికి ఎంపిక చేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు, పార్టీ నాయకులకు వీరబాబు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

4న మండల సమావేశం

రణస్థలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 4న నిర్వహించనున్నట్టు ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో రావాలని, ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

కోరం లేకుండానే బడ్జెట్ ఆమోదం

● ఇదీ సంతబొమ్మాళి మండల సమావేశం తీరు

సంతబొమ్మాళి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోరం లేకుండానే మండల బడ్జెట్‌ను ఆమోదించిన వైనం జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సాధారణంగా సమావేశం నిర్వహణకు మొత్తం సభ్యుల్లో మూడో వంతు మంది హాజరుకావాల్సి ఉంటుంది. అయితే ఆ మేరకుసభ్యులు హాజరు కాకుంటే సమావేశం వాయిదా వేయాలని నిబంధనలున్నాయి. అయితే ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తుంగలో తొక్కి, బడ్జెట్‌ను ఆమోదించిన ఘటనపై విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సరం సవరణ, 2025-26 అంచనా బడ్జెట్ ఆమోదానికి శనివారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సభ్యులకు సమాచారం అందించారు. అయితే ఎంపీపీ రాజేశ్వరి, నౌపడ-2, లక్కివలస, చినతుంగాం ఎంపీటీసీ సభ్యులు సుధాకర్, చింతల రాజులు, వాడరేవు జగది మాత్రమే హాజరయ్యారు. కేవలం నలుగురు సభ్యులు మాత్రమే సమావేశానికి వచ్చారు. మొత్తం 20 మంది సభ్యులుండగా సమావేశం ప్రారంభ సమయానికి నలుగురు మాత్రమే హాజరైనా కోరం లేకుండానే సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో జయంత్ ప్రసాద్ ప్రకటించారు. కార్యాలయ ఏవో కుమార్ బడ్జెట్ వివరాలు చదువుతుండగా మధ్యలో ఆర్‌హెచ్ పురం ఎంపీటీసీ సభ్యుడు నవరరాజు వచ్చారు. సభ ముగుస్తున్న సమయంలో మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు వచ్చారు. సమావేశ అనంతరం మండల పరిషత్ అధికారులు రాజారావుతో రిజిస్టర్‌లో సంతకం చేయించారు. అయినప్పటికీ కోరానికి ఏడుగురు సభ్యులు అవసరం కాగా ఆరుగురు మాత్రమే వచ్చా రు. అయితే కోరానికి మరో సభ్యుడు రావాల్సి ఉన్నప్పటికీ మిగిలిన సభ్యులు హాజరుకాకపోయినా 2024-25 సంవత్సరానికి 51,78,02,945లతో సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సరానికి 57,08,62,804లతో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీలుగా ఎన్నికై 39 నెలలైందని, తొమ్మిది నెలలు మాత్రమే రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇచ్చారని, బకాయిలు చెల్లించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. కోరం లేకుండా సమావేశం నిర్వహించడంపై ఎంపీడీవో జయంత్ ప్రసాద్‌ను వివరణ కోరగా బడ్జెట్ సమావేశానికి సభ్యులకు ఆహ్వానం పంపామని, కొందరు సభ్యులు హాజరు కాలేదని, ఎంపీపీ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి బడ్జెట్ ఆమోదించామన్నారు.


సమావేశం అనంతరం మేఘవరం ఎంపీటీసీ రాజారావుతో సంతకం చేయిస్తున్న సిబ్బంది

పోలాకిలో..

పోలాకి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ 2025-26 సంవత్సర బడ్జెట్ సమావేశం శనివారం ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. సూపరింటెండెంట్ బలగ సూర్యప్రకాష్ రూ.20,67,500 బడ్జెట్ నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో గరిమెళ్ల వెంకట రవికుమార్, ఉపాధ్యక్షులు కలదండు తాతారావు, కోట అప్పారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాసిరకం పనులపై తనిఖీలు చేయించాలి

● నరసన్నపేట మండల సమావేశం

నరసన్నపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన మరుగుదొడ్ల పనులు నాసిరకంగా ఉన్నాయని, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీ చేయించాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు కోరారు. శనివారం ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. గాలులకు పడేపోయేలా మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయని, చిన్నపిల్లలు భద్రతకు ప్రమాదకరంగా ఉన్నాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభలో ప్రస్తావించారు. దీనిపై క్యూసీ అధికారులతో తనిఖీ చేసి రిపోర్టు సమర్పించాలని సభ తీర్మానించింది. మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మృతికి సభ సంతాపం వ్యక్తం చేసింది. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరావు, పి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పలాస, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మొగిలిపాడు దాబా వద్ద హైవేపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఒడిశా రాష్ట్రం సుర్లా గ్రామానికి చెందిన కృష్ణారావుగా గుర్తించారు. వెంటనే అతడిని 108లో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. తల, కాలు, చేతిపై తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు అడ్డు రావడంతో..

టెక్కలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రావివలస కూడలి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సారవకోట మండలం కిన్నెరవలసకి చెందిన కె.జగన్నాథం గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై టెక్కలి నుంచి వస్తుండగా ఆవు అడ్డంగా రావడంతో బైక్ బోల్తా పడింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన జగన్నాథం.

రైలు నుంచి జారిపడి మహిళకు..

టెక్కలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగుమహంతిపేట గ్రామానికి చెందిన కె.తులసి శనివారం మధ్యాహ్నం నౌపడా రైల్వే జంక్షన్‌లో నౌపడా నుంచి విశాఖ వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు తులసికి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు.


గాయపడిన తులసి

విద్యార్థి నైపుణ్య ప్రదర్శనకు హ్యాక్‌థాన్ దోహదం

టెక్కలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను వ్యక్తీకరించేందుకు ఈ హ్యాక్‌థాన్ వేదిక దోహదం చేస్తుందని హైదరాబాద్‌కు చెందిన సీసీసీ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫౌండర్, సీఈవో ఉండవెల్లి నాగవీర్ అన్నారు. వివిధ రకాల సమస్యలకు పరిష్కారం చూపే హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి లక్ష్యం ఉండాలని, ఆ లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఐతం కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ కేంద్ర విశ్వవిద్యాలయాలు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 51 బృందాలు ఈ హ్యాక్‌థాన్‌లో పాల్గొంటుండడం ఆనందంగా ఉందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, హ్యాక్‌థాన్ వేదిక కన్వీనర్ డాక్టర్ సతీష్‌కుమార్, సంతోష్‌కుమార్, జె.సురేష్ కుమా ర్, గిరీష్ కుమార్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి హ్యాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఉండవెల్లి నాగవీర్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

టెక్కలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ 43వ జిల్లా మహాసభలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. దేశంలో మతోన్మాద భావజాలాలతో విద్యార్థుల మెదడులోకి మనువాదాన్ని చొప్పిస్తే భగత్‌సింగ్ వారసులుగా లౌకికత్వాన్ని సమాజమంతటా విస్తరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలే తప్ప విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు లేవని, దీంతో అరకొర చదువులకే విద్యార్థులు పరిమితమవుతున్నారన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చందు, కార్యదర్శి హరీష్, మహిళా కార్యదర్శి పవిత్ర, దుర్గా ప్రసాద్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పాఠశాలకు రోడ్డు

మెళియాపుట్టి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జలగలింగుపురం మండల పరిషత్ పాఠశాలకు ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత 20 ఏళ్లనుంచి రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసీపీ హయాంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తన ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించారు. అయితే అప్పటిలో టీడీపీ సర్పంచ్ రవ్వల అనూరాధ కావడంతో వైసీపీ నాయకులు పనులను అడ్డుకున్నారు. అయితే కూట మి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి సమస్యను తీసుకు వెళ్లడంతో పనులను శనివారం మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, సర్పంచ్ అనూరాధ గణపతిరావు ప్రారంభించారు.


పాఠశాలకు రహదారి పనులు చేస్తున్న దృశ్యం

మహా విష్ణువుకు అష్టాదశ హారతి

జలుమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర ఆలయంలో కొలువు తీరిన విష్ణుమూర్తికి శనివారం రాత్రి అర్చకులు అష్టాదశ హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం శని త్రయోదశి సందర్భంగా ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



లక్ష్యసాధనలో వెనుకబడితే చర్యలు

పాతపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం పెంపకాలపై ఇచ్చిన లక్ష్యాల సాధనలో వెనుకబడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పశుసంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యాధికారులు, సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ పాడి రైతు పశుగ్రాస పెంపకంపై ఆసక్తి కలిగేలా అవగాహనకలిగించాలన్నారు. మినీగోకులాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పశు వైద్యాధికారులు బి.శ్రీవాణి, పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రబీకి యూరియా సిద్ధం

నందిగాం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ సీజన్‌లో వరి సాగుకు అవసరమైన యూరియాను సిద్ధం చేశారు. నందిగాం, తామరాపల్లి, నరేంద్రపురం, పెద్దలవునిపల్లి తదితర గ్రామాల్లో రబీ కింద వరి సాగుచేయనుండడంతో దానికి అనుగుణంగా వ్యవసాయశాఖ యూరియా సిద్ధం చేసింది. శనివారం నందిగాం రైతు సేవా కేంద్రానికి 444 బస్తాల యూరియా రాగా, నందిగాం-2, పెద్దలవునిపల్లి, పెద్దతామరాపల్లి రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో ఉన్నట్లు ఏవో పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు.

పాత పనులకు దిక్కులేదు.. కొత్త వాటికి తీర్మానాలా?

● మున్సిపల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు
● ఆరు నెలల నుంచి ప్రశ్నిస్తే పనులయ్యేవి: గురిటి

పలాస, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాత పనులకే దిక్కు లేదు కొత్త పనులకు ఏ విధంగా తీర్మానాలు చేస్తారని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించగా ఆరు నెలల నుంచే పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వైసీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఈ విధంగా ఎందుకు ప్రశ్నించలేదని టీడీపీ కౌన్సిలర్లు ఎదురు ప్రశ్నలు వేశారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం నిర్వహించారు. వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, వైసీపీ కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్, దుర్గాశంకర్‌పండా, బెల్లాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2021లో తీసుకున్న తీర్మానాలకు నేటికీ పనులు జరగలేదని, కనీసం అంచనాలు కూడా వేసినట్లు కనిపించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో ఒకటి, రెండు పనులు చేసి చేతులు దులుపుకున్నారని, మా పదవీకాలం పూర్తయ్యేలోగా పనులు పూర్తవుతాయన్న నమ్మకం లేదన్నారు. టీడీపీ సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే పట్టణంలో పనులు జరుగుతున్నాయని, వైసీపీ నాయకులు గతంలో ఈ విధంగా ప్రశ్నించి ఉంటే పనులు ఇప్పటికే పూర్తయ్యేవన్నారు. దీనిపై చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ.. సాధారణ నిధులు వెచ్చించి కొన్ని అభివృద్ధి పనులు చేయించామన్నారు. పలువురు టీడీపీ సభ్యులు వార్డుల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సభ సంతాపం తెలిపింది.


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి హరిప్రియ

జలుమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టపరంగా మహిళలకు ఉన్న హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే ఎలా బయట పడాలనేది విషయాలను తెలుసుకోవాలన్నారు. ఆడ పిల్లలను ఇంటికి పరిమితం చేయకుండా చదివించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జన్ని రామారావు, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, వెలుగు ఏపీఎం ఎస్.హేమసుందర్, న్యాయవాదులు హరిప్రియ, సౌజన్య, హెచ్‌సీ రాజశేఖర్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేని రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ అన్నారు. శనివారం సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న భోజన, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. న్యాయవాదులు జీవీ రమణ, తూలుగు మధు, జైలు సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జగన్ తుగ్లక్ డ్రామాలను ప్రజలు నమ్మరు: బగ్గు



నరసన్నపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ అసమర్థత, అవినీతి వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయని, ఆయన తుగ్లక్ డ్రామాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల పెంపుభారం ఎవరిదో ప్రజలందరూ గమనించే గడిచిన ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఒప్పందాలను రద్దు చేసి కమీషన్లకు కక్కుర్తిపడి జగన్ రివర్స్ టెండరింగ్ పేరుతో విద్యుత్ రంగాన్ని కుప్ప కూల్చి ప్రజలపై మోపిన భారానికి ప్రస్తుతం ప్రజలు బలవుతున్నారన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మెళియాపుట్టి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో చేపడు తున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ఈఎన్‌సీ శ్రీనివాసరావు అన్నా రు. శనివారం మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల, చాపర-ఎంసీపీ కొత్తూరు రోడ్డు, నందల పాడులో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏకలవ్య పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా భవనాలను పూర్తిచేసి అందించాలన్నారు. రోడ్డు పనుల వద్ద సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. నందలపాడు సామాజిక భవనంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి సుమారు రూ.60 లక్షలతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయతో పాటు ఈఈ రమాదేవి తదితరులున్నారు.


సూచనలిస్తున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


కోటబొమ్మాళిలో నిరసన తెలుపుతున్న ఎంపీడీవో తదితరులు

కోటబొమ్మాళి/జలుమూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోటబొమ్మాళి, జలుమూరు మండలాల్లో ఎంపీడీవోలు ఫణీంద్రకుమార్, కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంపీడీవో తన ఉద్యోగ ధర్మం పాటిస్తే వైసీపీ నేతలు ఎంపీడీవోతో పాటు అటెండర్ ఇమ్రాన్, కారు డ్రైవర్‌లపై దాడి చేయటం దారుణమని, ఏ రాజకీయ నాయకుడైన ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేస్తే కఠిన శిక్షలుంటాయని, వారు భయపడేలా దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్ దామోదరరావు, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు డి.బాలకృష్ణ, వి.రమేష్, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


జలుమూరులో నినాదాలు చేస్తున్న ఎంపీడీవో తదితరులు

ఆశ్రమ పాఠశాల సందర్శన

కొత్తూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): లబ్బ ఆశ్రమ పాఠశాలను ఏఎంవో పి.కోటిబాబు శనివారం సందర్శించారు. విద్యార్థుల విద్యాస్థాయి, వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. పెండింగ్ సిలబస్ వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం దొండ మానుగూడ జీపీఎస్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

పని భారం తగ్గించాలి

నందిగాం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న తమపై పని భారం తగ్గించాలని జేఎల్ఎంలు వేడుకున్నారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో టి.రాజారావుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పరిధిలో పలు కార్యక్రమాల్లో తమను భాగస్వామ్యం చేస్తుండడంతో విద్యుత్ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నందున కొంతమేర మినహాయింపు ఇవ్వాలని కోరారు.

సైన్సుపై ఆసక్తి పెరగాలి

నరసన్నపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా ఉపాధ్యా యులు కృషి చేయాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. సామాజిక స్పృహ, కొత్త ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రావు, రాజేంద్ర నాయుడు, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

సారా రవాణా చేస్తే చర్యలు

కొత్తూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, రవాణా కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ తెలిపారు. ఎన్ని రామన్నపేట వద్ద చోడి రాజేష్ ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా శనివారం పట్టుకున్నారు. ఇతడిపై గతంలోనూ ఒక కేసు ఉండడంతో 15 రోజుల రిమాండ్ విధించారు.

పేకాట-శిబిరంపై దాడి

జలుమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వేస్టేషన్ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను శనివారం పట్టుకొని వారి వద్ద నుంచి రూ.10,720 నగదు స్వాధీనం చేసు కున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పేకాటరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

న్యూస్ బాక్స్

బాలలు ఆపదలో ఉంటే సమాచారం ఇవ్వండి

పలాస, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పిల్లల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చైల్డ్‌లైన్ హెల్ప్‌డెస్క్ సిబ్బంది కోరారు. ఈ మేరకు స్థానిక రైల్వే స్టేషన్లట ప్ల కార్డులు పట్టుకుని అవగాహన కలిగించారు. పిల్లల అక్రమ రవాణా, భిక్షాటన, తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే 1098కి సమాచారం అందించాలన్నారు. బాలబాలికలు ఎవరైనా ఆపదలో ఉంటే తక్షణం సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెల్ప్‌డస్క్ సిబ్బంది బాలసరస్వతి, మంజుల, ఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ నేత శశిభూషణ్‌కు శివాజీ పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ మంత్రి శివాజీ

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్ తండ్రి గురుమూర్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని మాజీ మంత్రి గౌతు శివాజీ శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తంచేశారు. పరామర్శించిన వారిలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నేతలు విఠల్, మల్లా శ్రీని వాసు, చిత్రాడ శ్రీనివాసు, సూరాడ మోహనరావు, అర్షవెళ్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కౌశిక్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

హరిపురం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 30న జరగనున్న రాష్ట్ర కౌశిక్ పోటీలకు మందస మండలం సొండిపూడి హైస్కూల్ విద్యార్థినులు డొక్కరి మాధవి, భాగ్యలక్ష్మి పాణిగ్రాహి ఎంపికైనట్లు హెచ్ఎం బి.సుందర్ సాల్మన్ తెలిపారు. జిల్లా తరఫున వీరు పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో క్విజ్, రీల్స్ విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ అప్పారావు, ఉపాధ్యాయులు కరుణాకర్, తులసీదాస్, నారా యణరావు, రమణ, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు చిన్నబరంపురం కొయ్యబొమ్మలు


కొయ్యబొమ్మలను పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు

హరిపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జనవరి 3న నిర్వహించనున్న డీఆర్‌డీఏ ఎగ్జిబిషన్‌లో మందస మండలం చినబరంపురం గ్రామానికి చెందిన కొయ్యబొమ్మలను ప్రదర్శించనున్నట్లు ఐటీడీఏ వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. ఈ మేరకు డ్వాక్రా మహిళలు తయారుచేసిన కొయ్యబొమ్మలను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మందసలో తయారయ్యే స్వీట్లు, కొవాలను కూడా ఈ ఎగ్జిబిషన్‌లో పెట్టనున్నామన్నారు.

హైవేకి సీసీ రోడ్డు కనెక్టివిటీ కల్పించండి

పాతపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రొంపివలస రోడ్డుకు కాగువాడలో జాతీయరహదారి 326-ఎకు కనెక్టవిటీ కలపాలని మాజీ సర్పంచ్ గణపతి రాజారావు నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామ్మోహన్ నాయుడు కృషి ఫలితంగా మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం, వంతెన నుంచి రొంపివలస వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారం లభించిందన్నారు. మహేంద్రతనయ వంతెన నుంచి కాగువాడను ఆనుకొని వెళ్లే 326-ఎ జాతీయరహదారికి కనెక్టవిటీ రోడ్ నిర్మించాలని కోరారు.


రామ్మోహన్‌కు సమస్యను విన్నవిస్తున్న రాజారావు

పోలీస్ దేహదారుఢ్య పరీక్షల్లో దళారులను నమ్మొద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ మూర్తి, పక్కన సీఐ మోహనరావు

టెక్కలి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల పోలీస్ గ్రౌండ్స్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహించనున్న దేహ దారుఢ్య పరీక్షల్లో అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎవరైనా ఇటువంటి మోసాలకు పాల్పడితే వెంటనే తనకు సమాచారం అందించాలని, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 31న అర్ధరాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అర్ధరాత్రి దాటిన తరువాత గుంపులుగా తిరగడం, డీజేలు పెట్టడం, బైక్‌ర్యాలీలు, మద్యపానం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు సీఐ విజయ్‌కుమార్ ఉన్నారు.